## చిట్టి కథ

# న్యాయం మారుతుంది!

"నూకాలమ్మా! నెలకు మూడు వారాలొచ్చి నాలుగో వారం ఎగ్గొట్టేస్తున్నావు. ఎందుచేతనంటే నీ యింట్లో నువు కూర్చుంటే నెల జీతం వచ్చేస్తోంది కాబట్టి. అంట్లు నేను తోముకుని జీతం నీకివ్వాలంటే నాకూ కష్టమనిపిస్తోంది. అందుచేత ఇకనుంచి ఏ రోజు మానేస్తే, ఆ రోజు డబ్బులు విరగ్గొట్టి మరీ ఇస్తాను జీతం" రాంబాయమ్మ ఖచ్చితంగా చెప్పేసింది నూకాలమ్మతో.

"ఇరగ్గొట్టండమ్మా! నేనేటి సేయను? సంటిదాని కూష్టమొచ్చి, వారంరోజు లాస్పత్రికాడుండి పోనానమ్మా! సంటిదానూష్ట మొగ్గేసరికి పెద్దదానికొచ్చి పడిపోనాది మాయరోగం, గుంటల్నింటికా డొగ్గేసి రాటానికి నాకు మారుదిక్కు నేదమ్మా! ఈ గుంటల్తో నాకు దినం తీరక సస్తున్నా" అంది నూకాలమ్మ కూడ నిస్పృహగా, బాధగా.

"మీ పనిమనుషుల ఎత్తులు, వంకలు నాకు తెలియనివి కావు కాని—ఇదిగో నీ జీతం మూడు వారాలది" అంటూ మూడు వారాల జీతం లెక్క కట్టి తెచ్చి నూకాలమ్మ కిచ్చింది రాంబాయమ్మ.

నూకాలమ్మ ఉస్సురంటూ వెళ్ళిపోయింది చేసేది లేక.

నూకాలమ్మ వెళ్ళిపోయిన తర్వాత—

"నూకాలమ్మ చంటిదానికి జ్వరం వచ్చిన మాట నిజమేనమ్మా! మొన్న ఆస్పత్రి దగ్గర నూకాలమ్మ చంటిదానితో కలసి కనిపించింది. ఒక వారం రోజులకి ఎలా సర్దుకున్నా మనం సర్దుకుపోవచ్చు" అంది రాధ తెగించి.

"అంట్లు నేను తోముకుని జీతం దానికి ఇవ్వాలంటే నాకూ కష్టంగానే ఉందమ్మాయ్. పని మనుషుల దొంగెత్తులు నాకు చెప్పకమ్మాయ్ రాధా! నాగాలు పెట్టినప్పుడల్లా డబ్బులు విరగ్గొట్టి ఇస్తే, ఈ పనిమనుషులకు బాగా బుద్ధి తెలిసివస్తుంది. ఏది ఏమైనా ఏ రోజు మానేస్తే, ఆ రోజు డబ్బులు విరగ్గొట్టి మరీ ఇస్తాను ఇక నుంచి" అంది రాంబాయమ్మ ఖరాఖండిగా పనిమనుషుల మీద అక్కసుతో.

*

రాధకు ట్యూషన్ ఫీజు వచ్చింది ఆరోజు. తల్లి చేతిలో పెట్టింది. లెక్కపెట్టి, "ఈ నెల ఇంత తక్కువ వచ్చిందేమిటి రాధా"? అంటూ ముందు గదిలోకి వచ్చింది, పుస్తకం చదువుకుంటున్న రాధ దగ్గరకు ఆత్రుతగా రాంబాయమ్మ.

"పోయిన నెలలో జ్వరం వచ్చి పదిహేను రోజులు నేను ట్యూషన్‌కి వెళ్ళలేదుకదమ్మా! అందుచేత పదిహేను రోజులదే ఇచ్చారు" అంది రాధ మామూలుగా.

"ఏమిటీ!! పదిహేను రోజులు ఫీజు విరగ్గొట్టి మరీ ఇచ్చారా? ఎంత దారుణం!! వాళ్ళకి రావా? జ్వరాలు, సీర్పాలూనూ! వాళ్ళకి రావా అవసరాలు! ఎంత విచిత్రం!" దీర్ఘాలు తీసింది రాంబాయమ్మ.

"బాగుందమ్మా! మనిట్లో మనం కూర్చుని నెల జీతం ఇమ్మంటే ఎవరిస్తారు? నూకాలమ్మ వారం రోజులు ఇంట్లో కూర్చుని నెల జీతం ఇమ్మంటే మనం ఇచ్చామా? విరగ్గొట్టి మరీ ఇచ్చాము. అలాగే వాళ్ళూనూ!" రాధ తీసిన దెబ్బకు పచ్చి వెలక్కాయ గొంతులో అడ్డు పడ్డట్టు అయి మరి మాట్లాడ లేక పోయింది రాంబాయమ్మ.

—ఎ. రంగ, విశాఖపట్నం

రావడం దగ్గర నుంచి తిరిగి వెళ్ళడం వరకు అందులోని యితివృత్తం.

సంక్రాంతి సంచిక రాగానే ఆత్రంగా చూసాను. కానీ, నా కథ కనిపించలేదు. మరి కొన్ని రోజులకు నా కథ నాకు తిరిగి వచ్చేసింది. ఆ కథ యీనాటికీ నా దగ్గరే భద్రంగా వుంది. దాన్ని మార్పులు చేసి పంపే ఆసక్తి కూడా నాకు లేదు.

ఆ తర్వాత అప్పుడప్పుడు ఒకటీ అరా రాస్తున్నా పోస్టుఖర్చులు దండుగ ఎందుకన్నట్లు ఏ పత్రిక్కీ పంపలేదు.

కాన్పులు, పిల్లలు—కొంతకాలం సంసార సముద్రంలో పడి వుక్కిరిబిక్కిరై పిల్లలు కాస్త పెద్దవాళ్ళయ్యాక వూపిరి పీల్చుకుని మళ్ళీ సాహిత్యం వైపు దృష్టిని మరలించాను.

ఈసారి నేను రాసిన మొట్టమొదటి వ్యాసం, 'ఇలా ఎందుకు చేసావు—?' అన్నది. ఇది '73 సం॥ ఆంధ్రజ్యోతి వారపత్రికలో ప్రచురించబడింది. ఆ వ్యాసాన్ని అచ్చులో చూసుకున్న రోజున నా ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను.

దాదాపు ఆ రోజుల్లోనే నా మొట్టమొదటి కథ 'పరిష్కారం' ఆంధ్రజ్యోతి వార పత్రికలో ప్రచురితమైంది. నా తొలి కవిత 'పాలకడలి' 76 సం॥ ప్రగతిలో ప్రచురితమైంది.

వ్యాసం, కథ ఆంధ్రజ్యోతిలో అచ్చయ్యాక యినుమడించిన వుత్సాహంతో మరి కొన్ని రచనలు చేసాను. నా దగ్గర వున్న వ్యాసాలను కథలను సరిదిద్ది ఫెయిర్ చేసి వివిధ పత్రికలకు పంపాను. రేడియోల్లో స్త్రీల కార్యక్రమంలో కూడా చాలా భాగం ప్రసారమయ్యాయి.

నా దృష్టి నవల మీదికి మళ్ళింది. 73 సం॥లో బంగ్లాదేష్ యుద్ధం యితివృత్తంగా తీసుకుని ఒక నవల రాసాను. కాని దాన్ని ఫెయిర్ చేసే శ్రద్ధ నాకు లేకపోయింది. అది యీనాటికీ వెలుగు చూడలేదు. దానిని ఎప్పటికైనా పబ్లిష్ చెయ్యగలిగితే తెలుగులో బంగ్లాదేష్ యుద్ధం మీద వచ్చిన తొలి నవల నాదే అవుతుంది.

ఆ తరువాత 74 సం॥లో 'వాహిని' అనే నవల రాసాను. ఆ నవల రాయడానికి దాదాపు సంవత్సరం కాలం పట్టింది. అది 76 సం॥లో 'వనిత' నిర్వహించిన దీపావళి నవలల పోటీలో ద్వితీయ బహుమతికి అర్హమైన రచనగా ఎన్నుకోబడింది. వారు దానికి 'వాహిని' అన్న పేరు కన్న, 'తెల్లవారని రాత్రి' అన్న పేరే సమంజసంగా వుంటుందని, భావించి ఆ విధంగా ప్రకటించారు. అందుచేత అచ్చయిన నా తొలి నవల, 'తెల్లవారని రాత్రి' అనే చెప్పాలి.

76 సం॥లో నా మొదటి నవలను ద్వితీయ బహుమతికి అర్హమైన రచనగా ఎన్నుకున్న 'వనిత' తిరిగి '84 సం॥లో నా పెద్ద కథ గాయత్రిని ప్రథమ బహుమతికి అర్హమైన రచనగా ఎన్నుకుని నన్ను రచయిత్రిగా నిలబెట్టింది.

సాహితీ ప్రపంచంలో యిలా అనేక మెట్లు ఎక్కుతూ రచనలు చేసి ఖ్యాతి గడించినా—బహుమతులు పొందినా ఒక్కసారి వెనుతిరిగి గతంలోకి చూసుకుంటే పసితనంలో ప్రమదావనంలో అచ్చయిన ఆ చిన్న వుత్తరం మనోవీధిలో మెదిలి మనస్సు అవ్యక్తమైన ఆనందానుభూతికి లోనవుతుంది. ఈనాటికీ అముద్రితంగా వుండిపోయిన నా తొలి రచన, 'పండుగ సరదా'ని తలుచుకున్నప్పుడు నవ్వురాక మానదు!